రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్: సా. 6.33	సహర్: ఉ. 4.58



మిల్లర్లపై విజిలెన్స్ నజర్

- జిల్లాలోని రైస్‌మిల్లుల లావాదేవీలపై విజిలెన్స్ అధికారుల దృష్టి
- అనుమతులు లేకుండానే మిల్లులను లీజుకు నడిపిస్తున్న పలువురు
- విజిలెన్స్ ఆరాతో అప్రమత్తమైన జిల్లా మార్కెట్ కమిటీ, మార్కెటింగ్ శాఖ
- లీజుకు తీసుకొని నడిస్తున్న 140 మిల్లులకు అధికారుల నోటీసులు
- లైసెన్సులు లేకుండానే కోట్ల రూపాయలు ఎగ్గొడుతున్న వ్యాపారులు

నిజామాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైస్‌మిల్లుల లావాదేవీలపై విజిలెన్స్ నజర్ పెట్టింది. కొంత మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రైస్‌మిల్లులు నడిపిస్తుండటంతో ఆరా తీస్తోంది. మార్కెటింగ్ శాఖ అధికారుల ద్వారా వివరాలను సేకరిస్తూనే అనుమతులు లేని వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. విజిలెన్స్ శాఖ ఆరాతో మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా అనుమతులు లేని రైస్ మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనుమతులు తీసుకోకుంటే కేసులు పెట్టడంతో పాటు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసుల సహకారంతో కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వివాదం ఎక్కువ అవుతుండటంతో రైస్‌మిల్లర్ల ప్రతినిధులు గడువు తీసుకోవడంతో పాటు అనుమతులు తీసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో 275 పైగా రైస్‌మిల్లులు

జిల్లాలో రా, బాయిల్డ్ రైస్‌మిల్లులు 275కు పైగా ఉన్నాయి. ఈ రైస్‌మిల్లులకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రెండు సీజన్‌లలో కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎఫ్‌సీఐకి బియ్యాన్ని లేవీ కింద అందిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, సంస్థల ద్వారా ఈ కేటాయింపులను చేస్తున్నారు. జిల్లాలో రైస్‌మిల్లుల యజమానులు కొంత మంది నడి పించలేని పరిస్థితుల్లో ఇతరులకు అప్పచెబుతున్నారు. వారి ఆధ్వర్యంలోనే నడిపించుకోవాలని కోరుతున్నారు. వారికి లీజులు ఇస్తున్నారు. జిల్లాలో ఇలాంటి లీజులు ఇచ్చిన మిల్లులు 140కి పైగా ఉన్నాయి. లీజులు తీసు కున్న వారు ఎలాంటి అనుమతులు లేకుండానే రైస్‌మి ల్లులను నడుపుతున్నారు. మిల్లర్ పేరు మీదే ధాన్యాన్ని తీసుకుంటూ లేవీ కింద ఎఫ్‌సీఐకి పెడుతున్నారు. లీజు పూర్తి కాగానే కొంత మంది కొత్త లీజును తీసుకుంటుండగా మరికొంత మంది వదిలేసి పోతున్నారు. నిబంధనల ప్రకారం రైస్‌మిల్లులు లీజు తీసుకున్న ప్రాసెసింగ్ లైసెన్స్‌తో పాటు పర్చేస్ లైసెన్సులు తీసుకోవాలి. లీజుకు తీసుకున్న వారు గత కొన్నేళ్లుగా ఎలాంటి లైసెన్సులు తీసు కోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే నడిపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్ తీసుకోవడంతో పాటు ఫీజు చెల్లించవల్సి ఉన్నా చేయడం లేదు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌తో పాటు స్థానిక నేతల మద్దతు ఉం డటం వల్ల యథేచ్ఛగా నడిపిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ కు రావాల్సిన ఫీజును ఎగ్గొడుతున్నారు. దీనివల్ల ప్రభు త్వానికి రావాల్సిన ఫీజులు రావడం లేదు. మార్కెటింగ్ శాఖ లేదా సంబంధిత మార్కెట్ కమిటీలో ఆ పరిధిలోని రైస్‌మిల్లులు లీజు తీసుకున్న వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ప్రాసెసింగ్ కింద లీజులు తీసుకొని నడిపే వారు తప్పనిసరిగా లైసెన్సు ఫీజు కింద లక్ష రూపాయలు చెల్లించాలి. దీని ద్వారా మూడు సంవత్సరాల పాటు అనుమతులను ఇస్తారు. పర్చేస్ లైసెన్సు కింద మూడు లక్షల రూపాయలు చెల్లించాలి. అనుమతులు తీసుకోవాలి. రైస్‌మిల్ యజమానులు తీసుకోగా లీజుకు తీసుకున్న వారు అనుమతులు తీసుకోలేదు. లైసెన్సు ఫీజు చెల్లించలేదు.

మార్కెటింగ్ శాఖ అధికారుల అప్రమత్తం

రాష్ట్ర వ్యాప్తంగా దృష్టి పెట్టిన విజిలెన్స్ శాఖ అధికారులు ఆరా తీయడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని ఏఏ రైస్‌మిల్లులు లీజుకు ఇచ్చారో వివరాలు తీసుకున్నారు. ఆ వివరాల ప్రకారం 140మిల్లుల వరకు లీజుకు ఇవ్వడంతో వారికి నెల క్రితమే నోటీసులను జారీ చేశారు. ఈ నోటీసులకు కూడా వారు స్పందన లేకపోవడంతో పోలీసు కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. వివిధ పోలీస్ స్టేషన్లకు ఆయా మిల్లులకు సంబంధించిన వివరాలను పంపించారు. స్టేషన్ల వారీగా వివరాలు వెల్లడంతో లీజుకు తీసుకున్న మిల్లుల వారు అప్రమత్తమయ్యారు. కేసులు లేకుండా చూసేందుకు రైస్ మిలర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. కొంత సమయాన్ని తీసుకొని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపే తీసుకునే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. కేసులు పెడితే ఇబ్బందులు ఉండటంతో లీజుకు తీసుకున్న వారు కూడా దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తుల వివరాల ఆధారంగా అనుమతులు ఇచ్చేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారం యథేచ్ఛగా జరగడం వల్ల మార్కెటింగ్ శాఖకు కోట్ల రూపాయల ఆదాయం ఆగిపోయింది. లైసెన్సులు ప్రతి సంవత్సరం తీసుకోవాల్సి ఉన్న తీసుకోకపోవడం లీజు తీసుకున్న వారు పట్టించుకోకపోవడం వల్ల యథేచ్ఛగా కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా రైస్‌మిల్లులపై నజర్ పెట్టిన విజిలెన్స్ అధికారులు మార్కెటింగ్ శాఖ అధికారులను వివరాలు అడగడంతో ఈ విషయం బయటపడింది. విజిలెన్స్ ఆరాతో అప్రమత్తమైన మార్కెటింగ్ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చిన వారందరూ ఈనెల 30లోపు తీసుకునే విధంగా ఒత్తిళ్లను పెంచారు. నిర్ణీత సమయంలోనే తీసుకునే విధంగా సహకరిస్తామని రైస్‌మిల్లుల యజమానులు హామీ ఇవ్వడంతో ఇంకా పోలీసు కేసులు పెట్టలేదు. గడువులోగా తీసుకోని వారిపై కేసులు పెట్టేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం వ్యవహారంలో ఆరోపణలు మూటకట్టుకున్న రైస్ మిల్లులకు విజిలెన్స్ శాఖ అధికారుల ఆరాతో ఉలిక్కిపడేలాగా చేసింది. ఈ నెలాఖరులోపు ఎంత మంది లైసెన్సులు మార్కెటింగ్ శాఖ ద్వారా తీసుకుంటారో, ఎంత మందిపై కేసులు పెడతారో తేలే అవకాశం ఉంది.

పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లలో చైతన్యం పెంపొందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ఆర్మూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

ఆర్మూర్‌రూరల్, మార్చి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలిం గ్ శాతం పెరిగేలా ఓటర్లలో చైతన్యం పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని స్ట్రాంగ్‌రూం, పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కాల్మేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని వారు పరిశీలించారు. అంతకు ముందు ఆర్మూర్‌లోని కమలా నెహ్రూకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న 73వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో సగటున 76శాతం పోలింగ్ నమోదు కాగా, 73వ పోలింగ్ కేం ద్రంలో అతితక్కువగా 55శాతం మాత్రమే ఓటింగ్ నమోదు కావడంతో స్థానిక అధికారులను కారణాలను అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీలు బస్వారెడ్డి, విష్ణు మూర్తి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూంల పరిశీలన

భీమ్‌గల్ రూరల్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. బాల్కొండ శాసనసభ సెగ్మెంట్‌కు సంబంధించి భీమ్‌గల్ పట్టణంలో ఎన్నికల నిర్వహణ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లుగా వినియోగించే ప్రభుత్వ జూనియర్ కళాశాల గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



వలసల జోరు

- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో వలసలపై దృష్టి పెట్టిన కాంగ్రెస్, బీజేపీ
- ఉన్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ నేతల యత్నాలు
- ఎన్నికల నోటిఫికేషన్ నాటికి భారీ చేరికలకు కాంగ్రెస్ ప్రయత్నాలు

నిజామాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రధాన పార్టీల నేతలు వలసలపై దృష్టి పెట్టారు. తమ క్యాడర్ ఇతర పార్టీలకు వెళ్లకుండా ప్రయత్నాలు చేస్తునే కొత్తవారిని చేర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇతర పార్టీలోనూ బలమైన నేతలను గుర్తించి వారితో మంతనాలు జరుపుతున్నారు. పార్టీకి చెందిన సీనియర్ నేతల ద్వారా చేర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పోటీలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ వలసలపై దృష్టి పెట్టగా బీఆర్‌ఎస్ నేతలు క్యాడర్‌ను కాపాడుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు పోతున్న మూడు పార్టీల నేతలకు ప్రచారంతో పాటు క్యాడర్‌ను కాపాడుకోవడం కూడా పెద్ద టాస్క్‌గా మారింది. ప్రతి గ్రామం నుంచి మండలం వరకు ఇన్‌చార్జిలను నియమిస్తూ వల సలను ప్రోత్సహిస్తున్నారు. పార్టీలో చేరే వారికి భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇస్తూచే ర్చుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వరకు భారీ ఎత్తున చేరికలు ఉండే విధంగా చూసు కోవడంతో పాటు మరింత బలోపేతం అయ్యే విధంగా ఈ పార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు కీలకంగా మారాయి.

పార్టీ బలోపేతంపై నేతల దృష్టి

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థిని ప్రకటించనుంది. ఎన్నికల నేపథ్యంలో మూడు పార్టీల నేతలు బలోపేతంపై దృష్టి పెట్టారు. తమకు మద్దతు తక్కువగా ఉన్న మండలాలపై ప్రధానంగా దృష్టిపెట్టి బలమైన నేతలతో చర్చిస్తున్నారు. వారిని తమ పార్టీలో చేర్చుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఆయా సామా జిక వర్గాల వారీగా ఓటరు మద్దతును కూడగట్టి తీసుకువచ్చేవారిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పార్టీకి చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల సమక్షంలో చేర్చుకుంటున్నారు. వీరితో పాటు జిల్లాస్థాయిలో పేరున్న నేతలతో చర్చలు జరుపుతున్నారు. పార్టీలో చేరాలని కోరుతున్నారు. పార్లమెంట్ పరిధిలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎక్కువగా ఈ వలసలను ప్రోత్సహిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బలంగా ఉన్న నేతలను గుర్తిస్తూ వారిని తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. కొంత మంది బలమైన జిల్లాస్థాయి నేతలను ఎన్నికల ప్రచారంలో జరిగే బహిరంగ సభల్లో చేర్చుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. మూడు పార్టీల నేతలు ఎన్నికలపై దృష్టి పెట్టడంతో తమ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్ నుంచి ఎక్కువగా వలసలు మొదలు కావడంతో ఆ పార్టీ నేతలు కిందిస్థాయిలో ఉన్న నేతలతో చర్చలు జరుపుతూ వెళ్లకుండా చూసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయినా ఎక్కువ మంది వలసలకు మొగ్గు చూపుతుండటంతో ఏం చేయని పరిస్థితుల్లో నేతలు ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిన మాజీ ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో నియోజకవర్గాల్లో ఉండకపోవడం సమన్వయ సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల క్యాడర్ ఎక్కువగా వలసలకు పోతుంది. జిల్లాలో ప్రధానంగా సీనియర్ నేతలు పార్టీ మారుతుండటంతో ఇప్పుడిప్పుడే రాష్ట్ర నేతలు దృష్టి పెట్టి చర్చలను కొనసాగిస్తున్నారు.

వలసలపై కాంగ్రెస్ నజర్

కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ప్రధానంగా వలసలపై నేతలు దృష్టి పెట్టారు. శాసనసభ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో రెండింటిని జిల్లాలో గెలుచుకోవడంతో బలోపేతంపై నేతలు దృష్టి సారించారు. జిల్లాలోని మిగతా నాలుగు నియోజకవర్గాల్లో బలమైన నేతలను గుర్తించి వారితో మంతనాలు జరుపు తున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, చైర్మన్లను హైదరాబాద్‌కు తీసుకువెళ్లి పార్టీలో చేర్చుకుంటున్నారు. పార్ల మెంట్ షెడ్యూల్ రావడంతో జిల్లాలోని బలమైన నేతలను గుర్తించి వారిని ఒకేసారి బహిరంగ సభలో పెద్ద ఎత్తున చేర్చుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. వీరితో పాటు మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సీనియర్ లీడర్లను చేర్చుకు నేందుకు మంతనాలు జరుపుతున్నారు. నిజామాబాద్‌కు చెందిన మేయర్‌తో పాటు మాజీ మేయర్‌తో కూడా చర్చలు జరిపారు. వీరే కాకుండా పలు సంఘాల నేతలతో చర్చిస్తున్నారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, సహకార సంఘాల చైర్మన్లను ఎక్కడికక్కడ చేర్చుకుంటున్నారు. వలసలను ప్రోత్సహిస్తూనే అభ్యర్థిని ప్రకటించగానే ప్రచారం నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో బలోపేతం కావడంతో పాటు ఈ దఫా ఎలాగైనా సీటును గెలవాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ నేత లు చేస్తున్నారు. ఇదే రీతిలో బీజేపీ పార్టీకి చెందిన నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలను చేర్చుకుం టున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఆహ్వానిస్తూ పార్టీలో చేర్చుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ప్రచారం వేడెక్కనుండటంతో మూడు పార్టీల నేతలు ముందే వలసలపై దృష్టి పెట్టి ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.



- ఏరాజ్‌పల్లిలో వరికోతలు



ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు?

- జిల్లాలో ప్రారంభమైన వరికోతలు
- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని ప్రభుత్వం
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రోజురోజుకూ ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు

బోధన్ రూరల్, మార్చి 19: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలవుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. దళారులు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం క్వింటా రూ.2300 ధర పలకగా.. ప్రస్తుతం రూ.1900 తగ్గించారు. దళారులు తమ ఇష్టారాజ్యంగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు.

మార్చిలో వరికోతలు

ఏటా మార్చిలో వరికోతలు ప్రారంభమవుతాయి. ఇది తెలిసిన ప్రభుత్వాలు ఏప్రిల్ రెండో వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెమ్మదిగా ప్రారంభించడం రివాజుగా మారింది. అయితే మార్చిలో వరి కోసిన రైతులు 20, 30రోజుల పాటు ధాన్యాన్ని నిల్వ చేయలేక వెంటనే వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. వెంటనే ధాన్యం విక్రయించకుంటే అకాల వర్షాలు కురిస్తే తడిసే ప్రమాదముంటుందని రైతులు భావిస్తున్నారు. ఈ భయంతోనే రైతులు నుర్పిడి చేసిన ధాన్యాన్ని వెంటనే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి మార్చి చివరి వారంలోనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వానాకాలం, యాసంగిలో సగం మంది రైతుల ధాన్యం విక్రయించిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ లోగా రైతులు వ్యాపారులకు, దళారులకు ధాన్యం విక్రయించారు. మద్దతు ధర లభించక తరుగు పేరుతో కోత బస్తాల్లో నింపకున్న బస్తాల పేరుతో కోత వెంటనే డబ్బులు ఇవ్వకపోయిన రెండు శాతం కమీషన్ గుమాస్తా మాములు, వేబ్రిడ్జి, తూకం వేయకపోయిన హమాలీ అంటూ రకరకాల కోతలతో రైతులు నష్టపోయారు. ప్రస్తుత సీజన్‌లో బోధన్ డివిజన్‌లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరి వారంలో వరికోతలు ఊపందుకుంటాయి. అయినా ప్రభుత్వం నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..

: బొడ్డు నారాయణ, రైతు (బోధన్)



గత ప్రభుత్వం ఏటా ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సగం మంది రైతులు వ్యాపారులు దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోయారు. ఈ ప్రభుత్వం అయినా మార్చి చివరి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభించాలి. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఈ యాసంగి నుండే క్వింటాకు రూ.500 బోనస్ కూడా చెల్లించాలి.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించిన ట్రైనీ ఫారెస్టు బీట్ అధికారులు



ట్రైనీ బీట్ అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, మార్చి 19: మండలంలోని చిన్న యానం గాదేపల్లి ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని దూలపల్లి ఫారెస్టు అకాడమీ హైదరాబాదు, ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు మంగళవారం సందర్శించారు. శిక్షణలో భాగంగా బ్యాక్‌వాటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. బ్యాక్ వాటర్ నందు వన్య ప్రాణుల చట్టాలపై ట్రైనీ ఫారెస్ట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిం కలు, పక్షులు తిరిగే ప్రాంతాల్లో పర్యటించారు. శిక్షణలో అకాడమీ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్మూర్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ ఉన్నారు.

‘కమ్మ కార్పొరేషన్‌తో పేద కుటుంబాలకు న్యాయం’



మాట్లాడుతున్న కమ్మ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్

డిచ్‌పల్లి, మార్చి19: సామాజిక న్యాయం కోసం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కమ్మ కార్పొరేషన్‌తో పాటు మరో15 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం హర్షనీయమని, కమ్మ కార్పొరేషన్ ద్వారా ఎందరో పేదకుటుంబాలకు న్యాయం జరుగుతోందని రాష్ట్రకమ్మ ఐక్య వేదిక కన్వీనర్ రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మా రం(బి) గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినంద నీయమని కమ్మకులస్థుల తరుపున ఆయన సీఎంకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. గడిచిన 100 రోజుల కాలంలో తెలంగాణలో ఇచ్చిన హామీలు, ఆరుగ్యారెంటీలు అమలు చేసిన ఘతన సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గమంత కాంగ్రెస్‌కే మద్దతు తెలిపిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలు, అవినీతి జరిగిందని, స్వలాభం స్కాంల ప్రభుత్వంగా కేసీఆర్ పేరు గడిచిందన్నారు. రేవంత్‌రెడ్డి సహకారంతో రాజకీయాల్లో కూడా కమ్మ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. గడిచిన 100రోజుల కాలంలో 5లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సహాయం కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కమ్మ సంఘం ప్రతినిధులు నాయుడు ఆంజనేయులు, రామకృష్ణ, నాగేశ్వరరావు, పున్నరావు పాల్గొన్నారు.

‘పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలి’

సిరికొండ మార్చి 19: పార్టీ కోసం కష్టపడి అంకిత భావంతో పనిచేయడం వల్ల పదవులు వాటంతటా అవే వస్తాయని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీరించిన తర్వాత మొట్టమొదటి సారిగా స్వగ్రామానికి వచ్చిన తాహెర్‌బిన్‌హందాన్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు తన ఇంటి వద్ద జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను భీమ్‌గల్ తాలుకా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా పీసీసీ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. జడ్పీకోఆప్షన్ సభ్యుడిగా, జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా, ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతీ కార్యకర్త అంకిత భావంతో, క్రమశిక్షణతో పనిచేయడం వల్ల పార్టీ ఖచ్చితంగా గుర్తించి పదవులు కట్టబెడుతుందన్నారు. సిరికొండ మండలనాకి సాగునీటి అందించడానికి జిల్లాకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ప్రతీ ఏడాది వడగండ్లు, లేదా అధిక వర్షం వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఆర్థింగా నష్టపోతున్నారని, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి,పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లెం గంగాధర్, జిల్లా,మండల నాయకులు ఎర్రన్న,బాల్‌రాజ్‌నాయక్, భూషన్‌రెడ్డి,ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి బాల్‌నర్సయ్య,నర్సింగ్,చందర్,రమేష్,మల్లేష్,డీలర్ రమేష్,శ్రీధర్, జగన్,రాజరెడ్డి, దేగాం సాయన్న, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,బన్నాజి,రాజేశ్వర్‌గౌడ్,సంతోష్‌రెడ్డి, లింబాద్రి, బాలయ్య రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నందిపేట, మార్చి19: మండలంలోని షాపూర్ గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బాలిక్ అహ్మద్ ఇచ్చారు. గ్రామంలోని సుమారు 295పశువులకు టీకాలు చేస్తూ రైతులకు గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాలికుంటు వ్యాధి నివారణ సహాయ సంచాలకులు డాక్టర్ అశోక్, మండల పశువైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి, పశువైద్యసిబ్బంది, రైతులు తధితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: కేశ్‌పల్లిలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్టు పశువైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జక్రాన్‌పల్లి, మార్చి19: మండలంలోని పడకల్ గ్రామ శివారులో అక్రమంగా మనోహరాబాద్ నుంచి తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి మంగళవారం తెలిపారు. అదే గ్రామంలో ఇసుక డంప్‌ను గుర్తించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసిన జిల్లా అధికారులు


దేవాదాయ శాఖ కమీషనర్‌ను కలిసిన జిల్లా ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 19: కొత్తగా దేవాదాయ శాఖ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హన్మంత్‌రావును జిల్లా ఆ శాఖ అధికారులు మంగళవారం కలిశారు.జిల్లా సహాయ కమీషనర్ సుప్రియ ఆధ్వర్యంలో ఉద్యోగులు కమిషనర్‌కు జిల్లాకు సంబంధించిన విషయాలను వివరించారు.ఉమ్మడి జిల్లా పరిధిలో దేవాలయాలు, భూములకు సంబంధించిన విషయాలను వివరించినట్లు తెలిపారు.

మోర్తాడ్‌లో క్యాన్సర్ ఉచిత హెల్త్ క్యాంప్


మాట్లాడుతున్న అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం నాయకులు

మోర్తాడ్, మార్చి19: మోర్తాడ్‌లో ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ప్రజలు క్యాన్సర్ రోగ నివారణకై ప్రజలు క్యాంప్‌ను సద్వినియోగపర్చుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం నాయకులు సారా సురేష్, జి.కిషన్ అన్నారు. మంగళవారం మోర్తాడ్‌లో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈనెల 21న ఉదయం 9గంటలకు ఉచిత క్యాంప్ నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ మాన దేశంలో ప్రధానంగా ప్రజలలో పీడిస్తున్న ఆరోగ్య సమస్యలలో ముఖ్యమైనవి క్యాన్సర్ అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై సరైన అవగాహన లేక అనేక పేద, మధ్య తరగతి ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ క్యాంప్‌లో క్యాన్సర్ వ్యాధి కాకుండా రొమ్ముక్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్వహిస్తున్నామని, ఇతర శరీర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.









‘వందశాతం పన్నులు వసూలు చేయాలి’


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సాయిబాబా


ఇంటి పన్ను నివేధికను అందిస్తున్న కార్యదర్శి సంధ్యారాణి

రెంజల్,మార్చి19: గ్రామాల్లోని పన్నుల వసూళ్లలలో వందశాతం పురోగతి సాధించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని డీఎల్‌పీవో సాయిబాబా అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ఇంటి పన్ను వసూళ్లను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య పనులను చేపట్టాలని నర్సరీలను సంరక్షించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని, మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోసి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతీ ఒక్కరు విధులు నిర్వహించి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో గౌస్, పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర గౌడ్, రాజేందర్, సాయిలు, రాజు, శ్రీకాంత్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు మంగళవారం గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ గ్రామాల్లో పన్నులు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణ కుమార్, ప్రేమ్ కుమార్, భూమేష్, ముతీబ్, కారోబార్‌లు శ్రావణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో ఇంటి పన్నులు వంద శాతం పూర్తి చేశారు. అట్టి నివేదికను మంగళవారం ఎంపీవో శివచరణకు కార్యదర్శి సంధ్యారాణి అందజేశారు. వంద శాతం పన్నులు వసూలు చేసినందుకు ఎంపీవో శివచరణ్ కార్యదర్శి సంధ్యారాణితో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీపి సిబ్బంది కారోబార్లు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సాగు సమస్యలకే వీడియో కాన్ఫరెన్స్

ముప్కాల్, మార్చి19: క్షేత్రస్థాయిలోసాగు సమస్యలన్నీ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు పొందేందుకే వీడియో కాన్ఫరెన్స్ విధానం ఉపయోగంగా పడుతోందని ఏడీఏ మల్లయ్య అన్నారు. మంగళవారం ముప్కాల్ రైతు వేదికలో నిర్వహించిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులతో వీడియో కాన్ఫరెన్స విధానం ద్వారా రైతు వేదికల నుంచి రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల నేరుగా మాట్లాడి రైతు నేస్తం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల వివిధ యాజమాన్య పద్ధతులపై డాక్టర్ శ్రీనివాస్, ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త రైతులకు వివరించారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను తీర్చారు. అయిల్‌ఫాం సాగులో తీసుకోవాల్సిన మేళకువలపై డాక్టర్ రాజశేఖర్ డీన్ ఆఫ్ హర్టికల్చర్ వివరించారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వేసవిలో వివిధ కూరగాయ పంటల్లో పురుగు మందుల వివరాలపై డాక్టర్ కె.కవిత, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఎంటమాలజీ వివరించి తదుపరి రైతుల యొక్క సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా క్షేత్రస్థాయిలో సాగు సమస్యలని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు పొందేందుకు ఉపయోగంగా ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రాజ్‌కుమార్; మహేంధర్‌రెడ్డి, మాలిక్, లావణ్య, ఏఈవోలు నిషికాంత్, అరుణ, రైతులు పాల్గొన్నారు.


ముప్కాల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

కమ్మర్‌పల్లిలో పోషణ పక్వాడ పక్షం పక్షోత్సవాలు


మాట్లాడుతున్న ఏసీడీపీవో జ్ఞానేశ్వరి

కమ్మర్‌పల్లి ,మార్చి 19: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్వాడ పక్షం పక్షోత్సవాల కార్యక్రమాన్ని రైతువేదికలో నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలు, ఆకుకూరలు, పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.అనంతరం నిర్వహించే కార్యక్రమాలు వాటికి సంబంధించిన ఫొటోలను ఆప్‌లోడ్ చేయడం పట్ల అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తూ తగు శిక్షణనిచ్చారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ పోషన అభియాన్ రాంబాబు అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్‌ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్షం పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏసీడీపీవో జ్యోతి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందజేయాలని సిరిధాన్యాలతో పాటు ఆకుల కూరలను తరచుగా తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షురాలు ఎ.తార, సరిత, స్వర్ణలత, సునంద, స్రవంతి, వహిదాబేగం, లింగమణి, తదితరులు పాల్గొన్నారు.

గుత్ప, కొత్తపల్లి గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై దాడి

● రూ.41వేల 770 విలువ గల మద్యం స్వాధీనం


గుత్పలో బెల్ట్‌షాప్ మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

మాక్లూర్, మార్చి19: మాక్లూర్ మండలంలో కొత్తపల్లి, గుత్ప గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై సీపీ ఆదేశానుసారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి బెల్ట్‌షాపుల్లో రూ.30వేల200 విలువ గల మద్యం, గుత్పలో రూ.11వేల 570 మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ దాడుల్లో సీఐ అంజయ్య, సిబ్బంది లక్ష్మణ్, సుదర్శన్, రాములు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● బెల్టు షాప్‌పై దాడి

రెంజల్: మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి బెల్టు షాపుపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ సాయన్న తెలిపారు. మద్యం విలువ 3,175రూపాయల ఉంటుందని, మద్యం విక్రయిస్తున్నా గాండ్ల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యుల్ని సంప్రదించాలి


డొంకేశ్వర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

డొంకేశ్వర్, మార్చి19: శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలని డొంకేశ్వర్ హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని నడ్కుడ, గాదేపల్లి ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న కుష్టు వ్యాధి సర్వేను ఆయన పరిశీలించారు. కుష్టువ్యాధి గ్రాస్థులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికి వెళ్లి శరీరంపై తెలుపు, గోధుమ రంగులో మచ్చలు ఉన్న వారిని వివరాలు సేకరించారు. ఈ సర్వే ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమై 24వ తేదీ వరకు కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హెల్బి అమూల్యా, ఎఎన్ఎం రజిని, ఆశాలు రాజమణి, శిరీష, పాల్గొన్నారు.

బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ 26నుంచి ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 19: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ రెగ్యూలర్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణయూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

రాంసాగర్ తండాలో ఒకరి ఆత్మహత్య

ఇందల్వాయి, మార్చి 19: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామ పరిధిలోగల రాంసాగర్ తండాలో లాలూ (43) దివ్యాంగుడు వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశారని కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కూతుళ్ల పెళ్లి కోసం అప్పులు చేయడంతో అప్పుల బాధ ఎక్కువ కావడం వల్ల లాలూ ఆత్మ హత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలి పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముప్కాల్, మార్చి19: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గడ్డల సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని, ఇటీవల చేపల వేటకు వెళ్లి మరణించిన అనికేష్ రమేష్ కుటుంబాన్ని మంగళవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

రుద్రూర్‌లో విఠలేశ్వర స్వామి వార్షికోత్స వేడుకలు

రుద్రూరు, మార్చి 19 : రుద్రూరు మండలకేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రామశర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వార్షిక వేడుకల్లో భాగంగా సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే భగవద్గీత ప్రవచనాలు ఉంటాయని ఆలయనిర్వాహకులు తెలిపారు. ఈనెల 20న కూడా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, 21న చివరి రోజు హోమం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు ఆలయ నిర్వహకులు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక


కాంగ్రెస్ ఆర్మూర్ కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి19: ఆర్మూర్ మండలానికి చెందిన నలుగురు మాజీసర్పంచ్‌లు, పలువురు కౌన్సిలర్‌లు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజామాజీ సర్పంచ్‌లు రాజేశ్వర్, మోహన్, సుద్దపల్లి నర్సయ్య, సవిత గణేష్, కౌన్సిలర్‌లు, మాజీకౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు, సంజయ్‌సింగ్‌బబ్లు, సడాక్ వినోద్, సంతోష్, జో.శ్రీనివాస్, మాజీసర్పంచ్ కొంగి సదాశివ్, కాటి హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీచైర్మన్ యాల్ల సాయిరెడ్డి, మారుతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్ల దాఖలు



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్ , మార్చి 19: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు నామినేషన్‌లను దాఖలు చేశారు. ఈనెల 28వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉండడంతో అధ్యక్ష పదవికి చిల్క సుబాష్, సంయుక్త కార్యదర్శి మద్దుల గంగారాం నామినేషన్‌లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారులు గరడి ఆనంద్, తాళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమంలో కృష్ణ పండిత్, ఎంకె.నరేంధర్, చిన్నారెడ్డి, కృష్ణంరాజు, జక్కుల శ్రీధర్, వెంకటేశ్వర్, జగన్, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య వార్డు జోన్-1 తనిఖీ



సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్,మార్చి 19: నగరమున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య వార్డు జోన్-1ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ఆకస్మికంగా తనిఖీ చేశారు.36వ డివిజన్‌లోనిదుబ్బ, నాందేవ్‌వాడ జోన్-1 వార్డు ఉదయం 5గంటల నుంచి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల హాజరు రికార్డు, మున్సిపల్ బిల్స్, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం 36, 43 డివిజన్‌లలో పర్యటించి కార్మికుల పనితీరు, డ్రైనేజీ, చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ జోన్-1లో మొత్తం కార్మికులు 180 మంది ఉంటే హాజరైన వారు 126 మంది ఉన్నారన్నారు. త్వరలో మిగతా వార్డులను కూడా తనిఖీలు చేస్తానని సానిటేషన్ విషయంలో కార్మికులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నగరంలో ప్రతీ కాలనీలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్మికులకు అండగా ఉంటానన్నారు. తప్పుచేస్తే ఎవరిని క్షమించేదిలేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌కెనాల్‌లో ఆటో బోల్తా



కెనాల్‌లో బోల్తా పడ్డ ఆటో

ఆర్మూర్‌టౌన్,మార్చి19:మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నిజాంసాగర్ కెనాల్‌లో మంగళవారం ఆటోబోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్ ఆజాగ్రత్త కారణంగా ఆటో బోల్తా పడిందని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు సంభవించలేదని అన్నారు. స్థానికులను ఆటోను బయటకు తీశారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

దుఃఖం దిగమింగుతూ పరీక్షకు హాజరైన విద్యార్థి

డిచ్‌పల్లి, మార్చ్ 19: మండలంలోని బర్ధిపూర్ శివారులో గల కేశాపూర్‌లో గడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షకు ఆయన కుమారుడు దనుశ్ రెడ్డి దుఃఖ దిగమింగుతూ.. హాజరయ్యారు.

బాధిత రైతులను ఆదుకుంటాం: రూరల్ ఎమ్మెల్యే



పంటలను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, మార్చి 19: వడగండ్ల వానతో నష్టపోయిన రైతులందరిని తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి, మెగానాయక్ తండా, డొంకల్ గ్రామాల్లో అకాల వర్షంతో రాలిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంట బీమా పథకాన్ని నిర్వీర్యం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ముదిరాజ్ రాష్ట్ర సంఘ అధ్య క్షుడు ఇమ్మడిగోపి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, డీసీసీబీ డెలిగేట్ వెంకట్‌రెడ్డి, సుధాకర్, సంతోష్ రెడ్డి, ఎల్ఐసీ గంగాధర్, కాంగ్రెస్ నాయకులు,తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి: అకాల వర్షాలు, వడగండ్ల వానాలతో చేతి కొచ్చిన వరి పంట నీటిపాలవడంతో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి గ్రామాల్లో నష్టపోయిన పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. కంట తడి పెట్టిన రైతులను ఎమ్మెల్యే ఓదార్చి భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, అమృతపూర్ గంగాధర్, ముప్ప గంగారెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, రాంచందర్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, పొలసాని శ్రీనివాస్, గంగాధర్, సాయిరెడ్డి, రాఘవ రెడ్డి, లక్ష్మరెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురు మంత్రులు, నాయకులను కలిసిన మానాల



మంత్రి పొన్నంను కలిసిన మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 19: తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంగళవారం పలువురు మంత్రులు, నాయకులను హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. సహకార సంఘాల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సలహాదారుడు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి సన్మానించారు. ఆయన వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● భీంగల్ బస్ డిపోను అభివృద్ధి చేయాలని వినతి

భీంగల్ డిపోలో పూర్తిస్థాయి అధికారులను నియమించి డిపో అభివృద్ధికి కృషి చేయాలని మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 1989లో ఏర్పాటు చేసిన బస్ డిపో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూసివేయడం జరిగిందని ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు నెలల క్రితం బస్ డిపోను పునః ప్రారంభించి ప్రజలను మభ్యపెట్టిందని కానీ ఇప్పటికి పూర్తిస్థాయిలో బస్సులు గానీ, సిబ్బంది గానీ నియమించలేదని కావున వెంటనే డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

ధర్పల్లి,మార్చి 19:పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి తరుణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు దుబ్బాక గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను, నర్సరీలను పరిశీలించారు. మార్చి 31లోపు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. పన్నుల వసూళ్లలో వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. మురికి నీరు రోడ్లపై రాకుండా చూడాలన్నారు. హరి తహా రానికి నర్సరీలను సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎండీవో బాలకిషన్, ఎంపీవో రాజేష్, ఈవో సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి హిందీ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్,మార్చి 19: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారంనిర్వ హించిన హిందీ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. 141 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 21,896 మంది హాజరు కావాల్సి ఉండగా 21, 836 మంది హాజరు కాగా 60 మంది విద్యార్థులు గైర్హాజర య్యా రు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా మాస్‌కాపీయింగ్ కేసున మో దు కాలేదు. జిల్లా కలెక్టర్ ఒక పరీక్షా కేంద్రాన్ని, జిల్లా విద్యా శాఖ అధికారి 10పరీక్షా కేంద్రాలను, జిల్లా పరిశీల కులు ఒక పరీక్షా కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందా లు 47 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు నవీపేట సొసైటీ మహాజన సభ

నవీపేట,మార్చి19: నవీపేట సొసైటీ మహజన సభను బుధవారం సొసైటీ కార్యాలయం ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని కార్యదర్శి మహేష్ తెలిపారు. ఉదయం 11గంటలకు సొసైటీ ఛైర్మన్ న్యాలకంటి అబ్బన్న అధ్యక్షతన జరిగే మహజన సభకు సొసైటీ డైరెక్టర్లు, సంఘం సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ ఉద్యోగుల సమావేశం

ఆర్మూర్‌టౌన్ ,మార్చి19: ఈనెల 21న విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘ జిల్లా సర్వసభ్య సమావేశం కలదని డివిజన్ కార్యదర్శి నరేందర్ నాయక్ తెలిపారు. ఈ సమావే శానికి రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్, ప్రధానకార్యదర్శి సాయి బాబా వస్తున్నారని, సమావేశం అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు ఉన్నందున విద్యుత సంస్థలో పని చేసే కార్మికులు, ఉద్యోగులు, అర్బి షన్‌లు, బిల్లింగ్ కార్మికులు హాజరై సభను విజయవంతం చేయానలి ఆయన కోరారు.